

హోరాహోరీగా..!

గ్రిగ్స్ ఫైనల్స్ ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాలుర పోటీలు ఆద్యంతం హోరాహోరీగా సాగాయి.

- 8లో



రథసప్తమి ఆదాయం రూ.70.39 లక్షలు

అరసవల్లిలో రథసప్తమి ఆదాయం గతేడాది కంటే పెరిగింది. ఇదే సమయంలో ప్రసాదాల ఆదాయం తగ్గింది.

- 8లో

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా వినాయకం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సంస్థ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డిప్యూటీ కలెక్టర్ కె.వినాయకంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జిలే బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

న్యూస్‌రీల్

నులిపురుగులను నిర్మూలిద్దాం

శ్రీకాకుళం పాతబస్టాండ్/శ్రీకాకుళం న్యూకాలనీ : జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీల విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలను ఈ నెల 10న విధిగా వేయించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఈ మాత్రలు తీసుకోవడం వల్ల విద్యార్థులపై ఎలాంటి దుష్ప్రభావాలు, అనారోగ్య సమస్యలు ఉండవని వివరించాలన్నారు. బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ మీటింగ్‌లో అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంఘాలు భాగస్వాములు కావాలన్నారు. 10న డీ-వార్మింగ్ డే, 17న మ్యాప్ అప్ డేలో భాగంగా వివిధ కారణాల రీత్యా మాత్రలు వేసుకోని వారిని గుర్తించి ఆ రోజు మాత్రలు వేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకటి నుంచి రెండేళ్ల పిల్లలకు సగం మాత్ర వేయాలన్నారు. 3 నుంచి 19 ఏళ్ల వరకు విద్యార్థులతో పాటు పాఠశాలలకు వెళ్లని డ్రాపౌట్ల పిల్లలకు అంగన్‌వాడీ కార్యకర్తలు ద్వారా మాత్రలు వేయించాలన్నారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థికి ఒక మాత్రను వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో తినిపించాలని సూచించారు.చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే పీహెచ్‌సీలలో మాత్రలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టీవీ బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 4,46,982 మందికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయాల్సి ఉండగా, ఐదు లక్షలకు పైగా మాత్రలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీపీఎంవో బి.రవీంద్ర, డెమో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

9న మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ పోటీలు



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని పీఎస్‌ఎన్ ఎంహెచ్ స్కూల్ వేదికగా ఈ నెల 9న మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం బాడీ బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ వి.విజయ్‌కుమార్, అధ్యక్షుడు బి.ప్రసాద్ తెలిపారు. విజేతలకు రూ.1,25,000 నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే బాడీబిల్డింగ్ క్రీడాకారుల ఎంపికలు బుధవారం నిర్వహించారు. గోపాల్ ఫిట్‌నెస్ జిమ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాయి హరీష్, శరత్ చంద్ర, కళ్యాణ్, మోహన్, ఇబ్రహీం, అరుగుల భాస్కర్ తదితరులు ఎంపికయ్యారు. నేషనల్ రిఫరీ బి.సూరిబాబు, జాయింట్ సెక్రెటరీ కె.గౌరీశంకర్, ఆమదాలవలస టీం కోచ్ శంకర్ యాదవ్, జీవన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సొమ్ము స్పాన్సర్లది సంబరం సర్కారుది



- వ్యాపారులు, పారిశ్రామికవేత్తల సహకారంతో విజయవంతంగా రథసప్తమి వేడుకలు
- స్పాన్సర్స్ కావాలని జేసీ నిర్వహించిన సమావేశంతో సత్ఫలితాలు
- ముందుకొచ్చిన జిల్లాలోని వివిధ రంగాల ప్రముఖులు
- ప్రభుత్వం పైసా ఇవ్వకపోయినా వివిధ వర్గాల సాయంతో అట్టహాసంగా నిర్వహణ



శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో లేజర్ షో (ఫైల్)



నగర వీధుల్లో శోభాయాత్ర (ఫైల్)



గీతాలతో హోరెత్తించిన మంగ్లీ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: రథసప్తమి వేడుకలు ముగిశాయి. రాష్ట్ర పండగగా ప్రకటించిన ప్రభుత్వం పైసా విడుదల చేయకపోయినా స్పాన్సర్ల సహకారంతో విజయవంతమయ్యాయి. ఒక వైపు దేవస్థానానికి విరాళాలిచ్చిన దాతల డోనర్ పాసుల విషయంలోనూ, సంప్రదాయంగా దర్శనం కల్పించడంలోనూ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించినప్పటికీ జిల్లాలోని మిగతా వ్యాపారులు, పారిశ్రామికవేత్తల సాయంతో పండగను సక్సెస్ చేసింది. నగరంలో జరిగిన అభివృద్ధి పనుల నుంచి విద్యుత్ కాంతులు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతరత్రా అలరించే ప్రోగ్రామ్స్ వరకు దాతలే దిక్కయ్యారు. జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో స్పాన్సర్స్ కావాలని వివిధ వర్గాలతో నిర్వహించిన సమావేశం సత్ఫలితాలను ఇచ్చింది. అధికారుల మాట కాదంటే టార్గెట్ అయిపోతామేమోననో.. ఇబ్బందులొస్తాయనో, దేవుడు కార్యక్రమానికి అడిగినప్పుడు సాయం చేయడం మంచిదనో తెలియదు గానీ జిల్లా యంత్రాంగం అడిగిన వెంటనే ప్రతీ ఒక్కరూ పోటీ పడి సాయం చేశారు. అయితే, ఆ సాయం ఎంతనేది అధికారులే లెక్క చెప్పాలి.



రథసప్తమి వేడుకల నిర్వహణకు

స్పాన్సర్స్ కావలెను..!

ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనం

అంతా అధికారులే..

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వేడుకల నిర్వహణ బాధ్యతను అధికారులే తీసుకున్నారు. కార్పొరేషన్, సుడా నిధులతో కొంతమేర అభివృద్ధి పనులు చేసినా అవి పూర్తయ్యేందుకు కూడా స్పాన్సర్లసాయం తీసుకున్నట్టు సమాచారం. ఇక, వేడుకలు విజయవంతంగా జరగడానికి సాంస్కృతిక, క్రీడా పోటీలు, విద్యుత్ కాంతులు, హెలికాప్టర్ రైడింగే ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. హెలికాప్టర్ రైడింగ్ ఒక్కొక్కరికీ రూ.1800 టికెట్ పెట్టడంతో గతంలో ఎన్నడూ ఎక్కని వారంతా ఒక్కసారైనా పయనించాలని ఆరాట పడ్డారు. డబ్బులను లెక్క చేయకుండా రైడింగ్ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీల నిర్వహణ, బహుమతులు అందజేయడంలో వ్యాపారులు, పారిశ్రామికవేత్తల భాగస్వామ్యం ఉంది. అట్టహాసంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలకు జ్యూయలరీ, వస్త్ర, ఇతరత్రా బడా వ్యాపారులు ఆర్థికంగా సాయపడ్డారు. ఇక, లేజర్ షో, క్రాకర్స్, హాస్యనటుల ప్రోగ్రాం, సింగర్ మంగ్లీ ఈవెంట్ కూడా దాదాపు దాతల సహకారంతోనే జరిగినట్టు సమాచారం.

సమన్వయంతో నిర్వహణ..

రాష్ట్ర, జిల్లా అధికారులు కూడా సమన్వయంతో వ్యవహరించారు. ముఖ్యంగా సింహాచలం దేవస్థానం, విశాఖ కనకమహాలక్ష్మి దేవస్థానం, అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి, విజయనగరం పైడితల్లి అమ్మవారు, శంబర పోలమాంబ ఉత్సవాలతో పాటు అరకు ఉత్సవాలకు వినియోగించిన అనేక శకటాలను ఇక్కడికి తెప్పించి శోభాయాత్రను విజయవంతం చేశారు. ఇందులో దేవదాయ శాఖ అధికారులు కీలక పాత్ర పోషించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి ముందుండి నడిపించగా.. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓ సాయి ప్రత్యూష, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వై.భద్రాజీ తదితరులు తమవంతు శాయశక్తులా పనిచేశారు. ఒక వైపు ఆలయానికి విరాళాలు ఇచ్చిన దాతలపై చిన్నచూపు చూసినప్పటికీ, ప్రభుత్వం పైసా విడుదల చేయకుండా చేతులు దులుపుకున్నా.. ఉత్సవాల నిర్వహణ భారాన్ని దాదాపు వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలే మోశారు. ప్రభుత్వంతో పనిలేకుండా దాతల సహకారంతో ఎంతటి కార్యక్రమాన్నైనా విజయవంతం చేయవచ్చనడానికి ఇదొక ఉదాహరణగా చెప్పుకోవచ్చు.



చిత్రలేఖన పోటీల విజేతలతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ (ఫైల్)

అవకాశం.. ఆకాశం.. ఆనందం

- హెలికాప్టర్ రైడ్‌ను ఆస్వాదించిన చిన్నారులు
- చిత్రలేఖన పోటీల్లో విజేతలుగా నిలవడంతో అవకాశం కల్పించిన అధికారులు

శ్రీకాకుళం కల్చరల్: ఆకాశంలో విహరించే హెలికాప్టర్‌లో ఉచితంగా ప్రయాణించాలంటే మాటలా.. అందుకు సరైన అవకాశం రావాలి. ఆ అవకాశాన్నే ఆ చిన్నారులు ఒడిసిపట్టారు. ఆకాశంలో చుట్టేసి ఆనందంతో పరవశించిపోయారు. రథసప్తమి ఉత్సవాల సందర్భంగా జిల్లా అధికారులు ఇటీవల చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిత్రాలు మాట్లాడుతాయి పేరిట 'సమగ్రత సమానత్వం' అనే అంశంపై జరిగిన ఈ పోటీల్లో 1 నుంచి 5 తరగతుల విభాగం, 6 నుంచి 10 తరగతుల విభాగాల్లో 645 మంది చిన్నారులు పాల్గొన్నారు. వీరిలో ప్రాథమిక పాఠశాల స్థాయిలో సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థిని కె.యశ్వంత్ సాయి(5వ తరగతి), శ్రీచైతన్య స్కూల్ విద్యార్థిని ఎం.నేహ అభియత్(5వ తరగతి), శాంతినికేతన్ విద్యార్థిని బి.రోషిణి(5వ తరగతి), వీఎస్‌ఎమ్‌హెచ్ స్కూల్ విద్యార్థి జి.దేవరాజు(10వ తరగతి), శ్రీకాకుళం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి సీహెచ్.ప్రేమ్‌కుమార్(పదో తరగతి), జి.సిగడాం ఏపీఎంఎస్ స్కూల్ విద్యార్థిని కె.యాశిత(పదో తరగతి)లు విజేతలుగా నిలిచారు. వీరందరికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు ఉచితంగా హెలికాప్టర్ రైడ్ అవకాశం కల్పించారు.



హెలికాప్టర్ వద్ద డ్రాయింగ్ పోటీల విజేతలతో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు (ఫైల్)

చాలా బాగుంది..



ఆకాశం నుంచి హెలికాప్టర్ ద్వారా అరసవల్లి ఆలయం, చెట్లు, ఇళ్లు, నది చూడటం చాలా బాగుంది. హెలికాప్టర్‌ను దగ్గర నుంచి చూడటం, ఎక్కడం నమ్మలేకపోతున్నాను. సమగ్రత సమానత్వం అనే అంశంపై బొమ్మలు వేసి విజేతలుగా నిలవడంతో ఈ అవకాశం రావడం ఆనందంగా ఉంది.

– ఎం.నేహ అభియత్, బి.రోషిణి



డచ్ బంగ్లా వద్ద హెలీరైడ్ (ఫైల్)

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ అధ్యక్షుడిగా మెంటాడ స్వరూప్

- పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం
- ఆరు జిల్లాల యువజన విభాగానికి నాయకత్వ బాధ్యతలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మెంటాడ స్వరూప్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ అధ్యక్షుడిగా మెంటాడ స్వరూప్ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం నియోజకవర్గానికి చెందిన స్వరూప్‌ను నియమిస్తూ పార్టీ కార్యాలయం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అంకితభావంతో అలుపెరగకుండా కష్టపడి పనిచేస్తున్న స్వరూప్‌కు పార్టీలో మంచి అవకాశం లభించింది. ఇప్పటికే జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా అందరి మన్ననలు పొందారు. స్వరూప్ పనితీరును గుర్తించిన పార్టీ అధినేత తాజాగా యువజన విభాగం జోనల్ అధ్యక్షుడిగా నియమించారు. ఈ క్రమంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల యువజన విభాగానికి అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. పార్టీకోసం అహర్నిశలు పనిచేస్తున్న స్వరూప్‌కు జోనల్ అధ్యక్ష పదవి దక్కడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

క్రషర్లపై కక్ష సాధింపు



- మంత్రి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై ఆంక్షలు
- అధికార పార్టీ కార్యకర్తలను మాత్రం పట్టించుకోని అధికారులు
- పోరాటానికి సిద్ధమవుతున్న బాధితులు

ఇబ్బందులు పడుతున్నాం...

క్రషర్ మూత పడటంతో ఆరు నెలలుగా పనిలేక ఇబ్బందులు పడుతున్నాం. మిగిలిన కార్మికులకూ ఎటువంటి పనిలేదు. మొన్నటి వరకు క్వారీలు పని చేయక కార్మికులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు మేము అవస్థలు పడుతున్నాం.

– సూర్యభాన్, క్రషర్ ఆపరేటర్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపులతో జిల్లాలో గ్రానైట్ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతోంది. నిన్నటి వరకు నెలల తరబడి గ్రానైట్ క్వారీలను నిలిపివేసి కార్మికులను నడిరోడ్డున పడేయగా తాజాగా క్రషర్లపై పడ్డారు. మంత్రి అచ్చెన్నాయుడు నియోజకవర్గమైన టెక్కలిలో అత్యధిక క్రషర్లను వేధింపులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు యజమానులుగా ఉన్న క్రషర్ల పట్ల కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. అధికార యంత్రాంగంతో దాడులు చేయించి చిన్నచిన్న తప్పిదాలను భూతద్దంలో చూపిస్తూ నెలల తరబడి మూసివేయిస్తున్నారు.

దాడులు చేయించి.. మూసివేయించి..

టెక్కలి నియోజకవర్గంలో సుమారు 14 క్రషర్లు ఉన్నాయి. గత ప్రభుత్వం వరకు ఏ ఒక్క క్రషర్ పైనా కక్ష సాధింపులు జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులుగా ఉన్నారనే నెపంతో 7 క్రషర్లపై మైన్స్ అధికారులతో దాడులు చేయించి వాటిని ఆపివేయించారు. అయితే కోటబొమ్మాళి మండలం కస్తూరిపాడు సమీపంలో మంత్రి అచ్చెన్నాయుడుకు చెందిన బంధువు ఓ క్రషర్ నిర్వహిస్తున్నాడు. దానికి మెటల్ క్వారీ, ఇతర అనుమతులు గానీ లేకపోయినా అధికారులు కన్నెత్తిచూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. టెక్కలి మండలం అయోధ్యపురం సమీపంలో టీడీపీకి చెందిన ఓ కార్యకర్త నిర్వహిస్తున్న క్రషర్ నుంచి లెక్కకు మించి ప్రొడక్షన్ వెళ్తున్నా పట్టించుకునే వారే లేరు. వర్క్ ఆర్డర్, మైనింగ్ ప్లాన్, ఈసీ, సీఎఫ్‌ఓ, మెటీరియల్ రవాణాలో ట్రాన్సిస్ట్ ఫామ్స్ వంటి నిబంధనలు లేకపోయినా మంత్రి ఆదేశాలకు అధికారులు తలొగ్గుతున్నారనే విమర్శలు ఉన్నాయి. కక్ష సాధింపు చర్యలకు నిరసనగా బాధిత యజమానులు పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



కక్ష సాధింపుల్లో భాగంగా టెక్కలి మండలంలో ఆరు నెలలుగా నిలిచిపోయిన ఓ క్రషర్

మిగతా చోట్లా ఇదే పరిస్థితి

ఒక్క టెక్కలి నియోజకవర్గంలోనే కాకుండా జిల్లాలో మిగతా చోట్ల కూడా ఇదే రకమైన కక్ష సాధింపులు జరుగుతున్నాయి. మీకున్న అనుమతులేంటి? ఎంత తవ్వకాలు చేశారు? ఎంత క్రషింగ్ చేశారు? తదితర వాటి వివరాలను పట్టుకుని రండి అంటూ కూటమికి చెందని క్రషర్లు, క్వారీల యజమానులను వేధింపులకు గురి చేస్తున్నారు. ప్రతిపక్షాలకు చెందిన క్వారీలను, క్రషర్లను ఇబ్బంది పెట్టి లొంగ దీసుకోవడమో, ఏకంగా మూయించాలనో కుట్రలు పన్నుతున్నారు. ముడుపుల కోసం, రాజకీయంగా అణగదొక్కడం కోసం ఈ విధంగా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారులు కూడా నో కామెంట్ అని చెప్పేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు పరిశుభ్రత కార్యక్రమాలు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ సేవాపథకం వలంటీర్ల నేతృత్వంలో శ్రీకాకుళం పట్టణంలో గురువారం పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా జాతీయ సేవాపథకం సమన్వయకర్త డాక్టర్ డి.వనజ తెలిపారు. వర్సిటీలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అనుబంధ కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్ల సహకారంతో ఆర్టీసీ కాంప్లెక్స్, నాగావళి నదీ తీరంలో ఉన్న రివర్ వ్యూ పార్కు ప్రాంతాల్లో చెత్తాచెదారాల తొలగింపు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. వర్సిటీ క్యాంపస్, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కాకినాడ ఆదిత్య కళాశాలల యూనిట్లు పాల్గొంటాయని చెప్పారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఆటో నుంచి పొగలు వస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలోని కేకే రాజపురం గ్రామం వద్ద ఆటోకి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆటో శ్రీకాకుళం నుంచి పాలకొండ ప్రధాన రహదారిపై కేకే రాజపురం వెళ్తుండగా దట్టమైన పొగలు వచ్చాయి. అటువైపుగా వెళ్తున్న వారు చూసి డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో వెంటనే ఆటో నిలిపివేశాడు. అనంతరం కొంత సమయం తర్వాత ఆటో నుంచి పొగ రావడం ఆగిపోయింది. అదృష్టవశాత్తు ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మరో రెండు డయాలసిస్ యూనిట్లు

కాశీబుగ్గ: పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు మరో రెండు డయాలసిస్ యూనిట్లను ఆంధ్ర మెడికల్ కాలేజీ అలుమ్ని ఆఫ్ నార్త్ అమెరికా మంజూరు చేసినట్లు బుధవారం స్పష్టం చేసింది. ఆంధ్ర మెడికల్ కాలేజీకి చెందిన ఎన్ఆర్ఐ వైద్యులు డయాలసిస్ యూనిట్లు అందించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గతంలో రాసిన లేఖకు వారు స్పందించారు. ఈ మేరకు కిడ్నీ రీసెర్చ్ కేంద్రానికి సుమారు రూ.15 లక్షల వ్యయంతో రెండు డయాలసిస్ యూనిట్లను అందించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ నెలాఖరుకు డయాలసిస్ యూనిట్లను అమర్చనున్నట్లు తెలిపారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్



శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజలకు సత్వరం న్యాయం అందించేందుకు, రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించేందుకు మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు భవనంలో ఆయన మాట్లాడుతూ సివిల్, క్రిమినల్ కేసులు రాజీ చేసుకోవడానికి లోక్ అదాలత్ చక్కటి అవకాశమని పేర్కొన్నారు. దీనివల్ల డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. సమావేశంలో న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

7 నుంచి మద్యం దుకాణాలకు డ్రా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో 2024–26 రెండేళ్లకు గాను నూతన మద్యం పాలసీలో భాగంగా గీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణాలు కేటాయించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతినాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిలో భాగంగా 16 మద్యం దుకాణాల కేటాయింపునకు ఈ నెల 7 నుంచి 10 వరకు లాటరీ విధానంలో అంబేడ్కర్ ఆడిటోరియంలో డ్రా తీస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

రథసప్తమి ఆదాయం ▸ రూ.70.39 లక్షలు

- గతేడాది కంటే పెరిగిన ఆదాయం
- భారీగా తగ్గిన ప్రసాదాల విక్రయాలు

అరసవల్లి:

రాష్ట్ర పండుగగా తొలిసారి నిర్వహించిన మూడు రోజుల రథసప్తమి మహోత్సవంలో దర్శన టికెట్ల ఆదాయం ఫర్వాలేదనిపించినా.. ప్రసాదాల ఆదాయానికి మాత్రం పెద్ద గండే పడింది. రథసప్తమి ఒక్కరోజున మొత్తంగా దర్శన టికెట్లు, ప్రసాదాలు ద్వారా రూ.70,39,308 లభించిందని ఆలయ ఈవో వై.భద్రాజీ బుధవారం ప్రకటించారు. గత ఏడాది రూ.50,90,530 ఆదాయం రావడంతో ఈ ఏడాది రూ.20 లక్షలు అధికంగా సమకూరిందని చెప్పారు. రూ.100 దర్శన టికెట్ల ద్వారా రూ. 17,72,000, క్షీరాభిషేకం టికెట్లు(రూ.500) ద్వారా రూ. 14,97,000, విశిష్ట దర్శనం టికెట్లు (రూ.300) ద్వారా రూ.32,07,600, కేశఖండనశాల టికెట్ల (రూ.40) ద్వారా రూ.44,000, లడ్డూ ప్రసాదాల (రూ.15) ద్వారా రూ. 2,76,375, పులిహోర ప్రసాదం (రూ.10) ద్వారా రూ.2,25,400, విరాళాల ద్వారా రూ.16,933 వరకు ఆదాయం లభించినట్లు ప్రకటించారు. రథసప్తమి మహోత్సవం నిర్వహణకు సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

'వీధి'కెక్కిన ప్రసాద విక్రయాలు..

ఉత్సవ నిర్వహణలో భాగంగా అమలు చేసిన పలు నిర్ణయాలతో కొంతమంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. అంతరాలయంలో క్షీరాభిషేకం అనంతరం తీర్థం, శఠగోపం తీసుకునే అవకాశాలు లేకుండా చేసిన పోలీసు, రెవెన్యూ అధికారుల తీరును భక్తులు బాహాటంగానే విమర్శించారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు పాసుల కుదింపుతో పాటు నేరుగా దర్శనానికి అవకాశమివ్వకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. మరో వైపు స్వామి వారి ప్రసాదాల విక్రయాలపై తీసుకున్న నిర్ణయాలపై ఉన్నతాధికారుల తీరుపై అటు భక్తులతో పాటు ఆలయ వర్గాలు కూడా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీతో పాటు భక్తులకు ఆలయ పరిసరాల్లో విక్రయిస్తే..దాన్ని మాత్రమే స్వామి వారి ప్రసాదంగా స్వీకరిస్తారు. అలాంటిది రిక్షా బండ్లపై తీసుకెళ్లి మెయిన్ రోడ్డులో పెట్రోల్ బంక్ వద్ద ప్రసాదం అమ్మే పరిస్థితి తెచ్చారు. ఆలయ చరిత్రలో తొలిసారిగా ప్రసాదాల విక్రయాలు ఇలా వీధికెక్కాయి. పోలీసు, రెవెన్యూ అధికారుల తప్పుడు నిర్ణయాలతో స్వామి వారి ప్రసాదాలను భక్తులు దర్శనానంతరం బయటకు వచ్చే మార్గంలో కాకుండా ఎక్కడో అర కిలోమీటర్ దూరంలో శ్రీకాకుళం రోడ్డులో అమ్మాల్సి వచ్చింది. దీనిపై ఆలయ ఈవో సైతం అభ్యంతరాన్ని తెలియజేసినా పోలీసుల అతి కారణంగా ఏమీ చెయ్యలేకపోయారని తెలిసింది. దీంతో లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,76,375, పులిహోర ద్వారా రూ.2,25,400 మాత్రమే ఆదాయం లభించింది. మొత్తంగా రూ.5,01,775 మాత్రమే ఆదాయం రాగా…గతేడాది ఈ రెండు ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.14,12,580 వరకు ఆదాయం లభించింది. ఫలితంగా ఈ ఏడాది దాదాపు రూ.10 లక్షల వరకు ఆదాయానికి గండి పడినట్లయ్యింది.



మెయిన్ రోడ్డుపై స్వామి వారి ప్రసాదాలు విక్రయాలు..ఇలా..

సాగులో డ్రోన్ల సాయం..!

- వ్యవసాయంలో పెరుగుతున్న సాంకేతికత
- సబ్సిడీపై డ్రోన్లు అందిస్తున్న ప్రభుత్వం
- మండలానికి మూడు అందించేందుకు చర్యలు



డ్రోన్ పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఆమదాలవలస:

సాంకేతికత పెరుగుతున్న నేపథ్యంలో అన్ని రంగాల్లో యాంత్రీకరణ పరుగులు పెడుతోంది. దీనిలో భాగంగా వ్యవసాయంలో సైతం రైతులకు ఉపయోగపడేలా కొత్త కొత్త పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో రైతులకు విత్తనాలు, ఎరువులు, అందించడంతో పాటు యాంత్రీకరణ పరికరాలు సకాలంలో సరఫరా చేసేవారు. అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం రైతులకు డ్రోన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లావ్యాప్తంగా 60 రైతు సంఘాలకు ఇప్పటికే డ్రోన్లు అందజేశారు. అలాగే వారికి వీటి వినియోగంపై శిక్షణ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా మరో 40 సంఘాలు దరఖాస్తు చేసుకున్నాయి.

ప్రయోజనాలు

ప్రభుత్వం అందజేస్తున్న డోన్లతో నేలలో తేమశాతం, స్థలాకృతి, నేలకోత, పోషకాలు, నేల ఆరోగ్యం గమనించవచ్చు. విత్తనం నుంచి పంటకోత వరకు పంటను చూడవచ్చు. తదుపరి వ్యవసాయ సీజన్ అర్థం చేసుకోవడంతో పాటు ప్రణాళిక చేయడంలో సహాయపడుతుంది. ప్లాంటేషన్ పర్యవేక్షణ, పశువుల నిర్వహణ, రసాయనిక ఎరువుల అధిక వినియోగాన్ని నివారించడం, వాతావరణం, జియో ఫెన్సింగ్, నీటిపారుదలను పర్యవేక్షించడం సాధ్యపడుతుంది. వ్యవసాయ సాగులో ముఖ్యంగా పంట స్ప్రేయింగ్‌కు ఉపయోగపడుతుంది. దీనివలన కూలీల అవసరాన్ని తగ్గించవచ్చు. డ్రోన్ వంద మీటర్ల దూరం వరకు మూడు మీటర్ల ఎత్తులో ప్రయాణిస్తుంది. బహుళ బ్యాటరీలతో కూడిన డ్రోన్ రోజుకు కనీసం ఆరు గంటల పాటు వినియోగించి, దాదాపు 30 ఎకరాల వ్యవసాయ భూమిలో సాగు చేయవచ్చు.

రైతులకు అందిస్తున్నారిలా...

జిల్లాలో 656 రైతు భరోసా కేంద్రాలు గత ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. వాటి పరిధిలో ఒక్కో మండలానికి మూడు డ్రోన్లు చొప్పున సప్లయ్ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒక డ్రోన్ యూనిట్ ధర రూ.10 లక్షలు కాగా, ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.8 లక్షల సబ్సిడీ ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రైతులు వినియోగించుకోవాలి



రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే డ్రోన్లు రైతులు సద్వినియోగం చేసుకోవాలి. యూనిట్ ధర రూ.10 లక్షలు కాగా, రైతులు రూ.2 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. కొంతమంది రైతులు సంఘంగా ఏర్పడి ఈ యంత్రాన్ని కొనుగోలు చేసి గ్రామాల్లో వినియోగిస్తే ఆదాయం లభిస్తుంది. డ్రోన్లను వినియోగించి సాగులో అధిక లాభాలు పొందవచ్చు.

– మెట్ట మోహన్‌రావు, వ్యవసాయశాఖ అధికారి, ఆమదాలవలస

12న మహా కుంభమేళా ప్రత్యేక బస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఈ నెల 12వ తేదీన ప్రత్యేక బస్సు బయలుదేరనుందని ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం కాంప్లెక్స్ ఆవరణలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ తేదీ రాత్రి 8 గంటలకు శ్రీకాకుళం బస్ స్టేషన్ నుంచి బస్సు బయలుదేరనుందని తెలిపారు. మధ్యాహ్నం భోజనం, ఉదయం, రాత్రి అల్పాహారం అందిస్తామని చెప్పారు. ప్రస్తుతానికి 20 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తిగా బస్సు బుక్ చేసుకున్నవారి ఇంటి వద్దకే బస్సు పంపిస్తామన్నారు. ఒకరికి టికెట్ ధరను సూపర్ లగ్జరీకి రూ.9,500గా నిర్ణయించినట్లు తెలిపారు.పూర్తి వివరాలకు 9959225609, 7382917289, 7382921647, 7382921810 నంబర్లను సంప్రదించాలని కోరారు. అలాగే మరొక కొత్త సూపర్ లగ్జరీ (2+2 పుష్ బ్యాక్) బస్సును 7 రోజులు– 7 క్షేత్రాలను దర్శింప చేసేలా సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

సజావుగా రబీ పంటల ఈ-క్రాప్



ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న త్రినాథస్వామి

నరసన్నపేట/జలుమూరు: జిల్లా వ్యాప్తంగా రబీ పంటల ఈ–క్రాప్ సజావుగా సాగుతోందని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి అన్నారు. మడపాంలో ఈ–క్రాప్ నమోదుపై కొన్ని సర్వే నంబర్లును ఎంపిక చేసుకొని బుధవారం సాయంత్రం సూపర్ చెక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 1,27,119 ఎకరాల్లో రబీ పంటలు రైతులు వేస్తే ఈ క్రాప్ బుకింగ్ 1,07,936 ఎకరాల్లో పూర్తి చేసినట్లు వివరించారు. ఈ ప్రక్రియ ఎలా జరిగిందనే దానిపై సూపర్ చెక్ చేస్తున్నామని తెలిపారు. అనంతరం పాగోడు పంచాయతీ వెలుసోదలో తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏలు రవీంద్రభారతి, భవానీ శంకర్, వ్యవసాయాధికారులు కె.సునీత, కె.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి అంతర్రాష్ట్ర నాటక పోటీలు

కవిటి: మండలంలోని బొరివంకలో ఈనెల 8, 9, 10 తేదీల్లో అంతర్రాష్ట్ర ఆహ్వానిత నాటక పోటీలు నిర్వహించనున్నట్లు కళింగ సీమ కళాపీఠం అధ్యక్షుడు బల్లెడ లక్ష్మణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్లెడ అనసూయమ్మ స్మారక ఆహ్వానిత నాటక పోటీల్లో మూడు రోజుల పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కళా సంస్థలతో రోజుకు రెండు ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దీనిలో భాగంగా ఈనెల 8వ తేదీన రాత్రి 7 గంటలకు గుంటూరు జిల్లా శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారిచే 'జనరల్ బోగీలు', అదేరోజు రాత్రి 9 గంటలకు విశాఖపట్నం తెలుగు కళా సమితి వారిచే 'నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత' అనే నాటికలు ప్రదర్శించనున్నారు. అలాగే 9వ తేదీ రాత్రి 7 గంటలకు ఒంగోలుకు చెందిన పండు క్రియేషన్స్ ఆధ్వర్యంలో కొప్పోలు కళాకారులచే 'పక్కింటి మొగుడు', రాత్రి 9 గంటలకు గుంటూరు జిల్లా అమరావతి ఆర్ట్స్ వారిచే 'చిగురు మేఘం' అనే నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. 10వ తేదీ రాత్రి 7 గంటలకు గుంటూరు అభినయ ఆర్ట్స్ వారిచే 'ఇంద్ర ప్రస్థం', రాత్రి 9 గంటలకు ఉత్తరాంధ్ర సౌజన్య కళా స్రవంతి వారిచే 'దేవరాగం' నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ పోటీలకు పెద్ద సంఖ్యలో కళాభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

థర్మల్ ప్లాంట్ ప్రతిపాదనలు విరమించుకోవాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు వాబ యోగి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆదివాసీ కమిటీ సభ్యులు

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిసర గ్రామాల్లో థర్మల్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనలు విరమించుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు వాబ యోగి కోరారు. ఈ మేరకు మండలంలోని వెన్నెలవలసలో ఆదివాసీలు, పరిసర ప్రాంత రైతులతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. థర్మల్ ప్లాంట్ నిర్మించి ఆదివాసీల బతుకులు బొగ్గుపాలు చేయవద్దన్నారు. థర్మల్ ప్లాంట్ నిర్మాణం మానవాళి వినాశనానికి కారణమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివలన నేల, నీరు, గాలి కలుషితమవుతాయని పేర్కొన్నారు. వంశధార రిజర్వాయర్‌లో ఉన్న నీటిని ప్లాంట్‌కు తరలిస్తే వేలాది ఎకరాల పంట భూములు బీడు భూములుగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పవర్ ప్లాంట్ వ్యతిరేక ఉద్యమానికి జిల్లాలోని మేధావులు మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం ప్లాంట్ వ్యతిరేక పోరాట కరపత్రాలు విడుదల చేశారు. సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ సరుబుజ్జిలి, బూర్జ మండల శాఖ అధ్యక్షుడు సురేష్ దొర, రైతుకూలీ సంఘం కార్యదర్శి వంకల మాధవరావు, డీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు కోత ధర్మారావు, అత్తులూరి రవి కాంత్, సింహాచలం, సవర ధర్మారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి వెలికితీయాలి

- జాతీయ చేనేత సలహా సంఘం మాజీ సభ్యుడు మంచు కృష్ణారావు



మాట్లాడుతున్న మంచు కృష్ణారావు

శ్రీకాకుళం అర్బన్: పాతపట్నం మండలం కొరసవాడలో 1973లో స్థాపించిన ఉమాశంకర చేనేత సహకార సంఘంలో జరుగుతున్న అవినీతిని వెలికితీయాలని జాతీయ చేనేత సలహా సంఘం మాజీ సభ్యుడు మంచు కృష్ణారావు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని ఎన్జీవో హోమ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొరసవాడ ఉమాశంకర చేనేత సహకార సంఘంలో గత 50 ఏళ్లుగా అవినీతి జరుగుతోందని విమర్శించారు. సంఘానికి అధ్యక్షత వహిస్తున్న మంచు చంద్రయ్య తన స్వలాభానికి సంఘం నిధులను కాజేసి, పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు అందకుండా అడ్డుపడుతున్నాడన్నారు. 2023–24 చివరి ఆడిట్‌లో 370 మంది చేనేత సంఘం సభ్యులు ఉన్నట్లు జాబితాలో చేర్చారని తెలిపారు. కానీ ప్రభుత్వం నియమించిన పీఐసీకి మాత్రం 132 మంది మాత్రమే ఉన్నట్లు జాబితా అందజేశారన్నారు. వీరిలో కూడా 28 మంది మాత్రమే మగ్గం కలిగిన చేనేత కార్మికులు ఉన్నారని వివరించారు. తక్షణమే జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కొరసవాడ ఉమాశంకర్ సొసైటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చేనేత సంఘ ప్రతినిధులు జనగ అప్పారావు, గణపతి రాజారావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బెంతొరియా సంఘం అభివృద్ధికి కృషి



రజనీకుమార్‌ను సన్మానిస్తున్న దేవరాజ్ సాహు తదితరులు

కవిటి: జిల్లాలో బెంతొరియా కుల సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు రజనీకుమార్ దొళాయి అన్నారు. మండలంలోని మాణిక్యపురంలో బెంతొరియా సంఘ సమావేశం బుధవారం నిర్వహించారు. ముందుగా ఈ సంఘానికి అధ్యక్షుడిగా పనిచేసిన శ్యాంపురియా మృతికి సంతాపం తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా రజనీకుమార్ దొళాయి, ఉపాధ్యక్షుడిగా ఢిల్లీ మజ్జి, సెక్రటరీగా గంగాధర్ సాహు, గౌరవ అధ్యక్షుడిగా మోహన్ సాహులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బెంతొరియా పెద్దలు దేవరాజు సాహు, భాస్కర్ దొళాయి, మేఘనాథ్ బిసాయి, శివ బిసాయి బృందావన, కృష్ణ బిసాయి తదితరులు పాల్గొన్నారు.

క్యాబ్‌కు నిప్పుపెట్టిన దుండగులు

ఆమదాలవలస: పట్టణంలోని నాలుగో వార్డు సొట్టవానిపేటకు చెందిన లింగిబేరి రామకృష్ణ మ్యాక్సీ క్యాబ్‌కు మంగళవారం రాత్రి దుండగులు నిప్పు పెట్టారు. క్యాబ్ డ్రైవర్ రామకృష్ణ తన ఇంటికి దగ్గరలో రాత్రి క్యాబ్‌ను పార్క్ చేశాడు. ఇది గమనించిన దుండగులు ఆ వాహనానికి ఎవరూ లేని సమయంలో నిప్పు పెట్టారు. మంటల్లో సగానికి పైగా దగ్ధమైంది. ఎగసిపడిన మంటలను స్థానికుల సాయంతో అదుపు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఈ మేరకు ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో రామకృష్ణ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా..!



ఉత్సాహంగా సాగుతున్న సాఫ్ట్‌బాల్ పోరు

- ప్రారంభమైన గ్రిగ్స్ ఫైనల్స్
- తొలిరోజు బాలురుకు పోటీలు
- నేడు బాలికల పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి పాఠశాలల గ్రిగ్స్ ఫైనల్స్ బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో హోరాహోరీగా పోటీలు జరిగాయి. ఇప్పటికే జిల్లాలోని జోనల్ స్థాయిలో క్రీడా పోటీలు జరగగా, అక్కడ విజేతలుగా నిలిచిన జట్లు/క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించారు. బాలుర విభాగంలో గేమ్స్ ఛాంపియన్‌గా పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిలిచింది. ఆ పాఠశాల క్రీడాకారుల బృందం బహుమతులు అందుకున్నారు.

10 క్రీడాంశాల్లో పోటీలు

తొలిరోజు బాలురుకు పది క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాల్ బాడ్మింటన్, టెన్నీకాయిట్, బాడ్మింటన్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, సాఫ్ట్‌బాల్ క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. గురువారం బాలికల విభాగంలోనూ ఇవే క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయి. 7వ తేదీన బాలబాలికలకు అథ్లెటిక్స్ ఈవెంట్స్ జరుగుతాయి. అంతకుముందు ఉదయం ఈ పోటీలను డీఈవో డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ముఖ్య సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, పి.తవిటియ్య, మెట్ట తిరుపతిరావు, కె.రాజారావు, సాదు శ్రీనివాసరావు, ఎం.ఆనంద్‌కిరణ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలుగా నిలిచిన పాఠశాలలు

- కబడ్డీ: విజేత జీహెచ్ స్కూల్ కోటబొమ్మాళి, రన్నరప్ ఎంహెచ్‌స్కూల్ లక్ష్మీనగర్.
- ఖోఖో: విజేత జెడ్పీహెచ్ స్కూల్ సంతఉరిటి, రన్నరప్ జీహెచ్ స్కూల్ పలాస.
- వాలీబాల్: విజేత ఎంజేపీ స్కూల్ శాస్త్రులపేట, రన్నరప్ జెడ్పీహెచ్ స్కూల్ కోదూరు.
- బాల్ బాడ్మింటన్: విజేత ఎంజేపీ స్కూల్ నరసన్నపేట, రన్నరప్ జీహెచ్ స్కూల్ టెక్కలి.
- బాడ్మింటన్: విజేత జెడ్పీహెచ్ స్కూల్ కాశీబుగ్గ, రన్నరప్ జెడ్పీహెచ్ స్కూల్ పెద్దసీది.
- టెన్నీ కాయిట్: విజేత జీహెచ్ స్కూల్ పలాస, రన్నరప్ ఎంజేపీ స్కూల్ సంతబొమ్మాళి.
- బాస్కెట్ బాల్: విజేత ఎన్టీఆర్ ఎంహెచ్‌స్కూల్ శ్రీకాకుళం, రన్నరప్ టీపీఎంసీ హైస్కూల్ శ్రీకాకుళం.
- ఫుట్‌బాల్: విజేత మున్సిపల్ హైస్కూల్ బలగ, రన్నరప్ టీపీఎంసీ హైస్కూల్ శ్రీకాకుళం.
- హ్యాండ్‌బాల్: విజేత జెడ్పీహెచ్ స్కూల్ అల్లినగరం, రన్నరప్ జెడ్పీహెచ్ స్కూల్ పాత్రునివలస.

సాఫ్ట్‌బాల్: విజేతగా జెడ్పీహెచ్ స్కూల్ ఇప్పిలి, రన్నరప్ జెడ్పీహెచ్ స్కూల్ కేశవరావుపేట నిలిచాయి.



హోరాహోరీగా సాగుతున్న కబడ్డీ ఫైనల్ పోరు



కబడ్డీ విజేతగా నిలిచిన లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు



ఖోఖో విజేతగా నిలిచిన జెడ్పీహెచ్ స్కూల్ సంతఉరిటి విద్యార్థులు



బహుమతులు అందుకుంటున్న పలాస జీహెచ్ స్కూల్ క్రీడాకారులు